సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



లబ్‌డబ్ లయ తప్పుతోంది

ఇటీవల కాలంలో గుండె జబ్బులు అధికంగా నమోదుకావడం, గుండె పోటు మరణాలు చోటు చేసుకుంటుండడం ప్రమాదకర సంకేతాలనిస్తోంది.




సమాజ హితం కోసమే సాహిత్యం

సాహిత్యం ఎల్లప్పుడూ సమాజ హితంగానే ఉంటుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు.

8 లో

2.49 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 2,49,680 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,200 క్యూసెక్కుల నీరు వదిలారు.



మండపేట కలువపువ్వు సెంటర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



అమలాపురంలో చంద్రబాబు వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, మాజీ ఎంపీ అనురాధ, వైఎస్సార్ సీపీ శ్రేణులు



పి.గన్నవరం శివారు పోతవరంలో వేంకటేశ్వరుని ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

బాబుకు బుద్ధి ప్రసాదించు స్వామీ..

- వైఎస్సార్ సీపీ అధ్వర్యంలో ఆలయాల్లో నేతల పూజలు
- తిరుమల లడ్డూ విశిష్టత మంటగలిపారంటూ ప్రభుత్వంపై ధ్వజం

సాక్షి, అమలాపురం: 'ముఖ్యమంత్రి చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించు స్వామి' అంటూ జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంలో చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయాలని వారు వేంకటేశ్వర స్వామిని కోరుకున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని జరిగిన కార్యక్రమాల్లో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ కో ఆర్డినేటర్లు, పార్టీలో వివిధ విభాగాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జిల్లాలో శనివారం వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం తమ పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు తిరుమల లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చిందంటూ నిరసన తెలిపారు. జిల్లా కేంద్రం అమలాపురం, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, కొత్తపేట, రాజోలులో జరిగిన కార్యక్రమాల్లో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విజయవాడ వరద రక్షణ చర్యల్లో విఫలం, సూపర్ సిక్స్‌లో ఒక్క పథకం కూడా అమలు చేయకపోవడం, వంద రోజుల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు లడ్డూ వివాదాన్ని కూటమి రేపిందని వారు ఆరోపించారు. బూట్లు వేసుకుని దేవుళ్లను పూజించే చంద్రబాబుకు హిందూ ధర్మం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.

- పి.గన్నవరం శివారు పోతవరంలో వేంకటేశ్వరుని ఆలయం వద్ద జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవితో పాటు పార్టీ క్యాడర్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో లడ్డూపై వివాదం చేసిన పాపం చంద్రబాబుదేనన్నారు.
- మండపేట కలువపువ్వు సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మండపేట మున్సిపాలిటీ, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నాయకులు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.
- అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, మాజీ ఎంపీ చింతా అనురాధలు పార్టీ శ్రేణులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వరుడిని, లడ్డూ ప్రసాదాన్ని దాదాపు 100 కోట్ల భక్తుల విశ్వాసాన్ని చంద్రబాబు తన కుటిల రాజకీయాలతో అపవిత్రం చేశారన్నారు. బాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని చేతపట్టి ఆలయ ప్రదక్షిణ చేశారు. నియోజకవర్గ పరిధి ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- రాజోలు నియోజకవర్గ పరిధిలో మామిడికుదురు కనకదుర్గమ్మ ఆలయం, మలికిపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు తిరుమల లడ్డూను సైతం వివాదం చేస్తున్నారని ఆరోపించారు.
- రామచంద్రపురం నియోజకవర్గ పరిధి ద్రాక్షారామ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.
- ముమ్మిడివరం మండలం పల్లిపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూజలు చేశారు. తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసి ఉన్న భూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు పూజలు నిర్వహించారు.



వాడపల్లి వేంకటేశ్వరుని ఆలయం వద్ద లడ్డూలతో ప్రదక్షిణ చేస్తున్న కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

- **కొత్తపేట నియోజకవర్గ పరిధి ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు.** తొలుత కనకదుర్గమ్మ వారి ఆలయంలో దర్శనం చేసుకుని, అనంతరం తిరుమల నుంచి తీసుకు వచ్చిన లడ్డూలను తలపై పెట్టుకుని వేంకటేశ్వరస్వామి గుడి మాఢవీధుల్లో ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై పవన్ కల్యాణ్ కూడా నోరుమెదపక పోవడం శోచనీయమన్నారు.

న్యూస్‌రీల్

కిక్కిరిసిన అప్పనపల్లి క్షేత్రం



ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: గోవిందా.. హరి గోవిందా నామస్మరణతో అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయం మార్మోగింది. శనివారం కావడంతో భక్తులతో కిక్కిరిసింది. తొలుత పవిత్ర వైనతేయ నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన శ్రీబాల బాలాజీ స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2,18,965 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,59,965, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.59 వేలు విరాళాలుగా వచ్చాయన్నారు. 4,956 మంది దర్శించుకోగా, 2,765 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

వలంటీర్ల మౌన ప్రదర్శన



అమలాపురం కలెక్టరేట్ వద్ద మౌన ప్రదర్శన చేస్తున్న వలంటీర్లు

అమలాపురం రూరల్: తమను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అమలాపురం కలెక్టరేట్ వద్ద వలంటీర్లు శనివారం మౌన ప్రదర్శన నిర్వహించారు. వలంటీర్ల సంఘ జిల్లా చైర్మన్ కె.సత్తిబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ జాతీయ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు తన రాజకీయ లబ్ధి కోసం వలంటీర్లు రాజీనామా చేయవద్దని, కూటమి అండగా ఉంటుందని చెప్పారన్నారు. వలంటీర్లకు నెలకు రూ.పది వేలు ఇస్తామని ప్రకటించి, ఇప్పుడేమో ఆ వ్యవస్థ లేకుండా చేస్తున్నారని అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ బండారు బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సతీష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఉగ్గిరాల సురేష్, మల్లారపు అజయ్ కుమార్, రాయుడు ప్రసాద్, బొక్కా శ్రీనివాసరావు, ఉగ్గిరాల శివ తదితరులు పాల్గొన్నారు.

1న జాబ్ మేళా

అమలాపురం రూరల్: వచ్చే నెల 1న వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమలాపురం కలెక్టరేట్‌లోని వికాస సంస్థ జిల్లా కార్యాలయం వద్ద ఈ మేళా జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ మాట్లాడుతూ తిరుపతి రేణిగుంట వద్ద ఇండో ఏఐఎం కంపెనీలో టెక్నీషియన్ పోస్టుకు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ పాసైన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులన్నారు. గూగుల్ పేలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా జిల్లాలో పనిచేసేందుకు 22 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన 10వ తరగతి నుంచి ఏదైనా డిగ్రీ చదివిన అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఆ రోజు అభ్యర్థులకు వికాస సంస్థ జిల్లా కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం



అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, చిత్రంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటైన అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి శనివారం ప్రారంభించారు. దీనిని ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పరిశీలించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు, గ్రూపులు తయారు చేసిన పలు ఉత్పత్తులను ఈ మార్కెట్‌లో విక్రయానికి ఉంచారు. శని, ఆదివారాల్లో ఈ మార్కెట్ ద్వారా రూ.2 లక్షల మేర వ్యాపారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు పట్టణ ప్రజలు పలు వస్తువులను కొనుగోలు చేశారు. మహిళలను ఆర్థికంగా ఆదుకునే దిశగా ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేసినట్లు మెప్మా కార్యాలయ ప్రతినిధి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. వస్త్రాలు, తినుబండారాలు, అల్లికల వస్తువులు, పలు డ్రైఫ్రూట్స్ తదితర వాటిని విక్రయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్ర, యేడిద శ్రీను, అబ్బిరెడ్డి చంటి, కొల్లాటి దుర్గాబాయి, కట్టొజు సన్నయ్యదాసు, యండమూరి గంగ తదితరులు పాల్గొన్నారు.

రానున్నది జగనన్న కార్యకర్తల రాజ్యం



వేణు, రాజాలను సత్కరిస్తున్న తూర్పుగోదావరి జిల్లా నియోజకవర్గాల నేతలు

- ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తా
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు
- ఘనంగా బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: పార్టీ మనుగడకు కార్యకర్త పునాది అని, అతనికి ఏ కష్టం వచ్చినా అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రకటించారు. శనివారం రాజమహేంద్రవరంలో హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాల్‌లో ప్రమాణ స్వీకార మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ రానున్నది జగనన్న కార్యకర్తల ప్రభుత్వమన్నారు. జిల్లా అధ్యక్షుడిని తానే అయినప్పటికీ తనను కార్యకర్తలే నడిపించాలన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, జక్కంపూడి రామ్మోహనరావు శిష్యుడిగా అంచెలంచెలుగా ఎదిగానన్నారు. జగనన్న మతం మానవత్వం అని ఎలుగెత్తి చాటారన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ వేణు సారథ్యంలో జిల్లాలో వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. అయినప్పటికీ కార్యకర్తల విషయంలో చిన్న లోపం జరిగిందన్నారు. అయితే అనుభవ పాఠాల నుంచి వాస్తవాలు గ్రహిస్తామని, పార్టీకి మంచి రోజులు వస్తాయని, మరోసారి సీఎంగా జగన్ వస్తారని రాజా ధీమా వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, శ్రీనివాస్ నాయుడు తదితరులు మాట్లాడుతూ కష్ట సమయంలో కార్యకర్తలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. మరోసారి జగన్‌ను సీఎంగా చేయడమే మన ముందున్న లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వేణును వారంతా ఘనంగా సత్కరించారు.

కోటిపల్లి రేవు వేలం వాయిదా

కె.గంగవరం: మండల ప్రజా పరిషత్ ఆధీనంలోని కోటిపల్లి రేవు వేలం పాట సోమవారం జరగాల్సి ఉంది. అయితే కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఉత్తర్వుల మేరకు వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ఎన్. శ్రీనివాసరావు శనివారం విలేకరులకు తెలిపారు. తదుపరి వేలం తేదీని ప్రకటిస్తామన్నారు.

పనులను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఇరిగేషన్‌కు సంబంధించి వివిధ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా శాఖల ఇంజినీర్లను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. శనివారం అమలాపురం కలెక్టరేట్‌లో డ్రైనేజీ, జలవనరుల శాఖ, గోదావరి హెడ్ వర్క్స్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఇటీవల మంజూరైన ఆపరేషన్ నిర్వహణకు సంబంధించి అత్యవసర శాశ్వత పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. నదీ ఏటిగట్టు పటిష్టం, నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగిస్తూ ఆయా వసతులను శాశ్వత ప్రాతిపదికన కల్పించాలని ఆదేశించారు. ఇందులో షట్టర్లు మరమ్మతులు వేగవంతం చేసి నీటి వృథాను పూర్తిగా అరికట్టాలన్నారు. పంట కాలువల్లో గుర్రపుడెక్క తొలగించే పనులను వేగవంతం చేసి శివారుకు సాగు నీరు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జల వనరుల శాఖ ఈఈ బి.శ్రీనివాసరావు, రాజోలు గోదావరి హెడ్ వర్క్స్ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ మహేష్ కుమార్ కోరారు. జిల్లాలో పాశర్లపూడి- దిండి వరకూ జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించి అభ్యంతరాలు, పెండింగ్ అంశాలపై ఇంజినీర్లు, రెవెన్యూ సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. పాశర్లపూడి వద్ద భూసేకరణకు సంబంధించి కొన్ని ఇబ్బందులు వచ్చాయని, పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. జేసీ టి.నిషాంతి పాల్గొన్నారు.

టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయాలి

టెంపుల్, ఎకో టూరిజం అభివృద్ధి ద్వారా సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి అధికారులతో జిల్లాలో ఇప్పటికే స్థాపించిన టూరిజం కేంద్రాల నిర్వహణ స్థితిగతులపై సమీక్షించారు. జిల్లాలో కోటిపల్లి, పాశర్లపూడి, ఆదుర్రు, అంతర్వేది, ఎస్.యానం, దిండిలలో పర్యాటకరంగ అభివృద్ధికి యోచిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టెంపుల్ టూరిజం అన్నవరం, అంతర్వేది, తదితర ప్రాంతాల్లోని దేవాలయాలను కలుపుతూ ప్రారంభించనున్నట్లు వివరించారు. జిల్లా ఇన్‌చార్జి పర్యాటక అధికారి డి.వెంకటాచలం, ప్రాంతీయ సంచాలకుడు స్వామినాయుడు పాల్గొన్నారు.

గలీజు ఒప్పందం


- పర్ర భూముల్లో అనధికార ఆక్వా సాగు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మత్స్యశాఖ

నా దృష్టికి రాలేదు..



ఈ పట్టా భూముల్లో ఆక్వా సాగు జరుగుతున్న విషయం నా దృష్టికి రాలేదు. అనధికార సాగు చేస్తున్న ఆ భూములను పరిశీలిస్తాం. తగిన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. –నరసింహారావు, తహసీల్దార్, అల్లవరం

అల్లవరం: అడిగేవారు లేకుంటే.. అధికారులు కునుకు తీస్తుంటే.. ఎవరి ఇష్టం వారిది. ఇలా 'గలీజు' ఒప్పందాలతో పర్ర భూములు కాస్త అనధికార ఆక్వా సాగుకు కేంద్రాలుగా మారుతున్నాయి. అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు నక్కా రామేశ్వరం బ్రిడ్జి ఆనుకుని నదీపాతంలోని 32 ఎకరాల ఏక్‌సాల్ లీజు భూముల్లో అనధికారి ఆక్వా సాగు యథేచ్ఛగా సాగుతోంది. రెవెన్యూ, మత్స్యశాఖ నుంచి అనుమతులు తీసుకోకుండానే మూడు నెలలుగా ఆక్వా సాగు చేపట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పర్ర భూముల్లో ఆక్వా సాగుకు ప్రయత్నించగా, అనధికార ఆక్వా సాగుపై అప్పటి ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఇలా రెండేళ్లుగా పర్ర భూముల్లో అనధికార చెరువులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు గ్రామంలోని కొంత మంది పెద్దలు పట్టాదారులకు డబ్బుల ఆశచూపి చెరువులను లీజుకు ఇచ్చేందుకు ఒప్పించి లీజుదారులతో రహస్యంగా అగ్రిమెంట్ చేసుకున్నారు. అంతేకాకుండా ఓ మంత్రి సహకారంతో పర్ర భూములకు పట్టాలు పుట్టించి, విద్యుత్ కనెక్షన్ కూడా తెచ్చుకునేలా బాధ్యత వహించాలని ఒప్పందం చేసుకున్నారు. కొమరగిరిపట్నం గ్రామంలో ఓ వ్యక్తి సహకారంతో మూడేళ్ల కాలానికి తొలుత రూ.45 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకుని సాగు చేపట్టారని సమాచారం. రెండు నెలల నుంచి ఆక్వా సాగు చేపడుతున్నా రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.



ఎస్.రామేశ్వరంలో నదీపాతం ఆనుకుని 32 ఎకరాల్లో అనధికార ఆక్వా చెరువులు



నదీపాతం మధ్యలో బ్రిడ్జికి ఇరువైపులా తవ్విన చెరువులు (ఫైల్)

భూముల కేటాయింపు ఇలా..

మత్స్యకార సంఘానికి చెందిన 32 మంది మహిళలకు 1994లో అప్పటి ఆర్డీఓ ఉషారాణి తాత్కాలికంగా సాగు చేసుకునేందుకు లాటరీ పద్ధతిపై నదీ పాతంలో ఈ 32 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏక్‌సాల్ లీజు పద్ధతిపై పట్టాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల్లో అప్పట్లో ఉప్పు సాగు చేసేవారు. కాలక్రమేణా ఉప్పు సాగు వదిలేయడంతో మడ అడవులు విస్తరించాయి. చాలా కాలంగా ఏక్‌సాల్ పట్టా భూములు ఖాళీగా ఉండడంతో గ్రామానికి చెందిన పెద్దలు ఆక్వా రైతులతో చేతులు కలిపి ఆక్వా సాగుకు తెర తీశారు. అనధికారికంగా సాగు చేస్తున్న చెరువులు నదీపాతంలో ఉన్నాయని, ఇవన్నీ ప్రభుత్వ భూములేనని స్థానిక వీఆర్వో సతీష్ నిర్ధారించారు. వీటికి రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవన్నారు. అనధికార ఆక్వా సాగుపై గ్రామానికి చెందిన పంతాడి సత్తిబాబు గత నెల 12న జిల్లా కలెక్టర్‌కు, మత్స్యశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. ఇది జరిగి 45 రోజులు గడిచినా అధికారులు స్పందించలేదని ఆయన వాపోయారు. అయితే అధికారులకు భారీ స్థాయిలో ముడుపులు అందడం వల్లే ఫిర్యాదుపై విచారణ చేపట్టలేదని ఆయన ఆరోపించారు. ఈ సాగుపై వివరణ కోరేందుకు మత్స్యశాఖాధికారి అశ్వనికి పలు మార్లు 'సాక్షి' ఫోన్ చేయగా స్పందించలేదు.

క్లుప్తంగా

కానరాని చిరుత జాడ


కోనసీమ డీఎఫ్‌ఓ ప్రసాదరావు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): బుర్రిలంకలోని నర్సరీ, పరిసరాల్లో అమర్చిన ట్రాప్, సీసీ కెమెరాల్లో చిరుతపులి కదలికలు నమోదు కాలేదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎఫ్‌ఓ ప్రసాదరావు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఫారెస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తెలిపిన అనుమానాస్పద ప్రదేశాల్లో సిబ్బంది వెళ్లి గమనించగా, అవి కుక్కల పాదముద్రలుగా గుర్తించామన్నారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో ట్రాప్, సీసీ కెమెరాల్లో చిరుతపులి కదలికలు గుర్తించలేదన్నారు. బుర్రిలంక సమీపంలోని గోదావరి లంకల్లో జింకలు ఉంటాయి కాబట్టి అటువైపు చిరుతపులి వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. ఆదివారం నుంచి గోదావరి లంకల్లో సిబ్బంది బృందాలుగా ఏర్పడి గమనిస్తారన్నారు. కడియపులంక సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, గ్రామస్తులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని వివరించారు.

మముబ్రోవుమా.. ఏడు కొండల స్వామీ


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి


ఆలయం వద్ద ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

- భక్తజన సంద్రంలా వాడపల్లి
- మార్మోగిన వేంకటేశుని నామం

ఆత్రేయపురం: మము బ్రోవుమా ఏడు కొండల స్వామీ.. అంటూ ఆ చిద్విలాసుడిని భక్తజనం కొలిచి తరించింది.. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన వేంకటేశ్వర స్వామిని చూసి తన్మయత్వం చెందింది.. గోవింద నామస్మరణతో వాడపల్లి క్షేత్రం దేదీప్యమానంగా వెలుగొందింది. శనివారం, ఆపై ఏకాదశి పర్వదినం కావడంతో ఆ స్వామి ఆలయం భక్తజన సంద్రాన్ని తలపించింది. వారం వారం భక్తులు పెరుగుతుండడం ఆలయ ప్రతిష్టను మరింత చాటుతోంది. కోనసీమ తిరుపతి, ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామివారిని వేద పండితులు, అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. తొలుత సుప్రభాత సేవ, నీరాజన మంత్ర పుష్పం తదితర పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తలనీలాలు సమర్పించి స్వామి దర్శనానికి క్యూ కట్టారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న వారు ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. కాలినడకన కూడా అనేక మంది ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్న సమారాధన జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 40 వేల మంది స్వామి దర్శనానికి వచ్చినట్లు అధికారుల అంచనా. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

లబ్ డబ్ లయ తప్పుతోంది

- నానాటికీ పెరుగుతున్న గుండె జబ్బులు
- యువతలోనూ మరణాల ముప్పు
- ఆహార అలవాట్లతో ఆరోగ్యానికి రక్ష


జీజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్న హృద్రోగులు

కాకినాడ క్రైం: ఇటీవల కాలంలో గుండె జబ్బులు అధికంగా నమోదుకావడం, గుండె పోటు మరణాలు చోటు చేసుకుంటుండడం ప్రమాదకర సంకేతాలనిస్తోంది. యువతలో ఈ ప్రమాదాలు ఎక్కువవుతుండడంతో వైద్య వర్గాల్లోనూ ఆందోళన కనిపిస్తోంది. కోవిడ్ ప్రభావంతో పాటు మారుతున్న జీవన శైలి, పెరుగుతున్న ఒత్తిడి, శారరక వ్యాయామం లేకపోవం, ఆహార నియమాల లోపం గుండె జబ్బులకు ప్రధాన కారణాలని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జిల్లాలో గుండె జబ్బుల సమగ్ర స్థితిగతులతో పాటు, వైద్య అవకాశాలు, వాస్తవాలు–అపోహలు తదితర అంశాలపై కథనం.

గుండె పోటు అంటే...

గుండెకు రక్తాన్ని సరఫరా చేసే కరోనరీ ఆర్టరీ రక్తనాళాలు కొలెస్ట్రాల్ నిక్షేపం వల్ల రక్త ప్రవాహంలో ఆటంకం కలిగి గుండెపోటు సంభవిస్తుంది. కాగా కార్డియాలజిస్టుల నివేదికలను అనుసరించి కోవిడ్ వచ్చినవారిలో ప్రస్తుత పరిస్థితుల్లో గుండె పోటుకు అవకాశాలు ఎక్కువవుతున్నాయి. అలాగే మధుమేహం ఉన్నవారిలోనూ ఈ ప్రమాదాలు ఎక్కువేనని వైద్యులు అంటున్నారు.

యువతలోఎక్కువ ఎందుకంటే...

గుండె జబ్బుకు పెరుగుతున్న వయసూ కారణమే. వయసు పెరిగే కొద్ది గుండె జబ్బులు పెరిగే ప్రమాదం అధికమవుతుంది. అలాగే మగవారిలో గుండె జబ్బులకు ఆస్కారం ఎక్కువ. మగవారితో పోల్చుకుంటే ఆడవారిలో ఈ ప్రమాదం తక్కువ. కుటుంబ నేపథ్యం కూడా కీలక పాత్ర పోషిస్తుంది.

6 గ్రాముల కంటే తక్కువ ఉప్పు..

ఉప్పు రక్తపోటుని పెంచడంతో గుండెజబ్బులకు కారణమవుతుంది. కొవ్వులేని, తక్కువ కొవ్వు ఉన్న ఉత్పత్తులను ఎంచుకోవాలి. సమతులాహారంతో పాటు వ్యాయామం గుండెను పదిలం చేస్తుంది.



జీజీహెచ్‌లో గుండె జబ్బుల విభాగం

ఫస్ట్ స్ట్రోక్ ఏమీ కాదా..

తొలి సారి వచ్చే గుండె నొప్పి ప్రాణానికి హాని కాదని చాలా మందిలో ఓ నమ్మకం ఉంది. అది పూర్తిగా అపోహేనని రాఘవ ఆసుపత్రి కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ రాఘవ చౌదరి తెలిపారు. తొలి స్ట్రోక్‌తో మరణాలు సంభవించిన ఉదంతాలు అనేకం ఉన్నాయన్నారు.

ఈ లెక్క సరిపోయిందా...

ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కార్డియాలజిస్టులు చెబుతున్నారు. అందుకు నిత్య జీవితంలో ఉపయోగపడే పరీక్షలైన బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ ఉండాలని అంటున్నారు.

గుండె జబ్బుతో 61 మరణాలు

జిల్లాలో ఏడాది కాలంలో గుండె జబ్బుతో 61 మరణాలు సంభవిచాయి. వీరిలో 40 ఏళ్ల లోపు వారు 18 మంది ఉన్నారు. వైద్య ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది చేపట్టిన సర్వేలలోని గణాంకాల ప్రకారం ఏడాది కాలంలో జిల్లా వ్యాప్తంగా 2188 మంది గుండె జబ్బులకు గురయ్యారు. కాకినాడ జీజీహెచ్‌లో హృద్రోగ వైద్య సేవలు కొనసాగుతున్నాయి. అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి.



కోరుకొండ నరసన్నకు బంగారు కిరీటం


ఈఓ రామచంద్రమోహన్‌కు బంగారు కిరీటాన్ని అందజేస్తున్న దాత ఆదినారాయణ మూర్తి


బంగారు కిరీటం

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానం దత్తత ఆలయం కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారికి 40 గ్రాముల బంగారంతో చేయించిన బంగారు కిరీటాన్ని కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన బి.ఆదినారాయణ మూర్తి శనివారం సమర్పించారు. దీనిని అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమూర్తికి దాత అందజేశారు. కిరీటం తయారీకి రూ.2.70 లక్షల ఖర్చయ్యిందని దాత తెలిపారు. రోజూ కోరుకొండ నరసింహ స్వామివారికి ఈ కిరీటం అలంకరించాలని కోరారు. ఈ కిరీటాన్ని కోరుకొండ దేవస్థానం ఆభరణాల రిజిస్టర్‌లో నమోదు చేసి రోజూ స్వామివారికి అలంకరించాలని ఆ దేవస్థానం అధికారులను ఈఓ ఆదేశించారు. ఏఈఓ కొండలరావు, డీఈ బీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్యానికి సహకరించండి

మాజీ సీఎం జగన్‌కు యువకుడి వినతి


మాజీ సీఎం జగన్‌తో వంగా గీత, వీరబాబు, ప్రసాద్, యువకుడు ప్రసన్నకుమార్

గోకవరం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న గోకవరానికి చెందిన కోసిన ప్రసన్నకుమార్ వైద్యానికి సహకరించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరామని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తెలిపారు. గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్ సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతుండగా క్యాన్సర్ బారిన పడ్డాడు. కీమోథెరపీ, బోన్‌మారో థెరపీ తదితర చికిత్సలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ ద్వారా సహకారం అందడంతో బసవతారకం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందాడు. అయితే దురదృష్టవశాత్తు నాలుగు నెలల కిందట తదుపరి వైద్య పరీక్షల అనంతరం వ్యాధి మళ్లీ తిరిగబెట్టినట్టు వైద్యులు నిర్ధారించారు. దానికి చికిత్సగా ఇమ్యూనోథెరపీ అందించాలని, దీనికి సుమారు రూ.13 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు తెలిపారు. దీనికి ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వర్తించదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు యువకుడి పరిస్థితిని మాజీ ఎంపీ వంగా గీతకు తెలియజేయగా ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకుని ఈ మేరకు అభ్యర్థించారు. దీనిపై జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని వైఎస్సార్ సీపీ నాయకుడు వీరబాబు శనివారం తెలిపారు. జగన్‌ను కలసిన వారిలో స్థానిక నాయకుడు తోలేటి రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

అంతులేని దుఃఖంతో అంత్యక్రియలు


గోదావరి ఒడ్డున తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సీతామహాలక్ష్మి

ఆలమూరు: చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచిన తండ్రి మృతి చెందగా, అంతులేని దుఃఖంతో ఆ కుమార్తె అంత్యక్రియలు నిర్వహించింది. ఈ సంఘటన ఆలమూరులో శనివారం జరిగింది. స్థానిక ఇండియన్ బ్యాంక్ సమీప ప్రాంతంలో నివాసముంటున్న గన్ని అమ్మిరాజు (64) అనారోగ్యంతో మృతి చెందారు. తన తండ్రి అమ్మిరాజు మరణ వార్త తెలుసుకుని ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉంటున్న ఏకైక కుమార్తె సీతామహాలక్ష్మి కలత చెందింది. హుటాహుటిన ఆమె బయలుదేరి తన స్వగ్రామానికి చేరుకుంది. బంధువుల సహకారంతో అమ్మిరాజుకు సీతామహాలక్ష్మి తలకొరివి పెట్టింది. స్థానిక గౌతమీ గోదావరి ఒడ్డున హిందూ శ్మశానవాటికలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. కొడుకు లేడనే భావన లేకుండా తండ్రి రుణం తీర్చుకున్న సీతామహాలక్ష్మిని పలువురు అభినందించారు.

సమాజ హితం కోసమే సాహిత్యం


గ్రంథావిష్కరణ చేస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: సాహిత్యం ఎల్లప్పుడూ సమాజ హితంగానే ఉంటుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో తెలుగు విభాగం, స్ఫూర్తి కుటుంబం సంయుక్తంగా 'శ్రీగురు విశ్వస్ఫూర్తి రచనలు–ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం' అనే అంశంపై శనివారం జాతీయ సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ వివిధ దృక్పథాలతో 40 గ్రంథాలను రచించిన విశ్వస్ఫూర్తి సాహిత్య సేవలు అభినందనీయమన్నారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో గురోపదేశం గావించే వ్యక్తి శ్రీగురు విశ్వస్ఫూర్తి అన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ సదస్సుకు దక్షిణాది రాష్ట్రాల నుంచి సుమారు 350 మంది హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా 'శ్రీగురు విశ్వస్ఫూర్తి రచనలు – ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం' పేరుతో రూపొందించిన పరిశోధనా గ్రంథాన్ని, సదస్సులో 79 పరిశోధన పత్రాలను సమర్పించగా, వాటితో 'వ్యాసావళి' పేరుతో తయారు చేసిన గ్రంథాన్ని కూడా ఇన్‌చార్జి వీసీ ఆవిష్కరించారు. ఆచార్య డి.జ్యోతిర్మయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మద్రాస్ తెలుగు యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య విస్తాలి శంకర్, యోగి వేమన సీఈ ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి, స్ఫూర్తి కుటుంబ ప్రతినిధి ఎం.రజనీకాంత్, మేనేజింగ్ ట్రస్టీ వి.సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె ఆచూకీ కనిపెట్టండి


విలేకరులతో మాట్లాడుతున్న తల్లి ప్రమీల

గోకవరం: తంటికొండలోని సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ దీప్తి స్వర్ణలత అదృశ్యంపై ఆమె తల్లి ప్రమీల స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీప్తి స్వర్ణలతను శనివారం పలువురు స్థానిక నాయకులు, రైతులు పంట నష్టం నమోదు విషయంలో దుర్భాషలాడి అవమానించారని తనకు ఫోన్ చేసి బాధపడిందని ప్రమీల వివరించారు. వెంటనే తాను సచివాలయం వద్దకు వెళ్లేసరికి తన కుమార్తె కనిపించలేదని, తోటి సిబ్బందిని అడిగినా సరైన సమాధానం రాలేదన్నారు. తన కుమార్తె ఆచూకీ కనిపెట్టడంతో పాటు, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్


దుక్కా నాగేశ్వరరావు

తుని రూరల్: విధి నిర్వహణలో అలసత్వం, ఉన్నతాధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు దుక్కా నాగేశ్వరరావును సస్పెన్షన్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఉత్తర్వులు జారీ చేసినట్లు అదనపు ఎంఈఓ ఎ.రామకృష్ణ శనివారం తెలిపారు. ఈ నెల 24న మర్లపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సాధారణ తనిఖీల్లో భాగంగా ఎంఈఓ పి.గీతాదేవి, అదనపు ఎంఈఓ ఎ.రామకృష్ణ వెళ్లారు. ఉదయం తొమ్మిది గంటలైనా ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పాఠశాలలకు రాలేదు. దీంతో సమీప గ్రామంలో ఉన్న మరో ఉపాధ్యాయుడిని రప్పించి పాఠశాల పర్యవేక్షణను అప్పగించారు. అదే సమయంలో పాఠశాలకు వచ్చిన నాగేశ్వరరావును ఆలస్యానికి కారణం అడగ్గా సరైన సమాధానం ఇవ్వలేదు. ఉద్యోగం బాధ్యతగా చేయాలని సూచించి, రికార్డులు పరిశీలించేందుకు సిద్ధమవ్వగా తన దగ్గర ఎటువంటి రికార్డులు లేవని, తాను రాయలేదని నాగేశ్వరరావు పేర్కొన్నట్టు ఏఎంఈఓ తెలిపారు. తన అనుమతి లేకుండా పాఠశాలకు ఎందుకు వచ్చారని ఎంఈఓలను ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. పాఠశాల నుంచి బయటకు వెళ్లకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించాడన్నారు. తీవ్రమైన పదజాలంతో బెదిరించడంతో ఈ విషయాన్ని ఎంఈఓలు డీఈఓకి తెలియజేశారు. దీనిపై అందిన ప్రాథమిక సమాచారంతో దుక్కా నాగేశ్వరరావును డీఈఓ సస్పెన్షన్ చేసినట్లు ఏఎంఈఓ రామకృష్ణ తెలిపారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

రూ.24.99 లక్షల సొత్తు రికవరీ


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన ఇసుకలేటి మోజెస్, ఇసుకలేటి గాంధీ, రాజమహేంద్రవరానికి చెందిన తిపర్తి పురుషోత్తం రామ్‌కుమార్ తాళాలు వేసి ఉన్న ఇళ్లను బద్దలు కొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇలా నాలుగు ఇళ్లు గుల్లచేసి రూ.25.09 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించారు. ఇంద్రపాలెం, పెదపూడి, బొమ్మూరు, రాజానగరం పీఎస్‌ల పరిధిలో ఈ దొంగతనాలకు పాల్పడ్డారు. సొత్తు అమ్ముకుని జల్సాలకు పాల్పడ్డారు. నిందితులు కాకినాడ శివారులో పట్టుబడినట్లు ఎస్పీ వెల్లడించారు. వారి నుంచి రూ.24.99 లక్షల సొత్తు రికవరీ చేశామన్నారు. మరో కేసులో 20 మోటార్ సైకిళ్లను చోరీ చేసిన కాకినాడకు చెందిన కడగాల యేసు, గొర్రెల దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

కొవ్వూరులో అల్లర్లపై విచారణ


శ్రీరామ కాలనీలో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న చిట్టిబాబు, శ్రీమన్నారాయణ

కొవ్వూరు: స్థానికంగా చోటు చేసుకున్న అల్లర్లపై పౌర హక్కుల సంఘం నిజ నిర్ధారణ కమిటీ ఆయా కాలనీల్లో పర్యటించింది. ఈ సందర్భంగా కమిటీలోని పౌర హక్కుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ శనివారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. రెండు కాలనీల్లో అల్లర్లలో గాయపడిన వారిని పరామర్శించి ఘటనకు దారి తీసిన పరిస్థితులను తెలుసుకున్నట్లు తెలిపారు. 19న ఊరేగింపుగా వెళుతున్న సమయంలో చోటుచేసుకున్న వివాదం, కొట్లాటలో పలువురు గాయాల పాలయ్యారన్నారు. రూరల్ ఎస్సైకి సైతం కాలు విరిగిపోయిందన్నారు. ఇరువర్గాలు ప్రశాంతంగా ఉండాలని సూచించామన్నారు. రెండో రోజు మళ్లీ దాడులు చోటు చేసుకోవడం ఇంటిలిజెన్స్ వైఫల్యమేనన్నారు. శ్రీరామ కాలనీలో దళితులపై దాడి చేసి విధ్వంసం సృష్టించిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు. నిందితులను తక్షణం అరెస్ట్ చేయాలని పోలీసు ఉన్నతాధికార్లను నివేదించనున్నట్లు ప్రకటించారు. ఎస్సీ పేటపై పెద్ద ఎత్తున దాడిచేసి విధ్వంసం సృష్టిస్తే ప్రభుత్వం నిందితులను అరెస్ట్ చేయకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ ఇచ్చి శాంతియుత వాతావరణం తీసుకురావాలని సూచించారు.